

హైదరాబాద్ వార్త

# ఎంగిలిపూల సంబురం







**అంబరానంటిన బతుకమ్మ సందడి**
**ఆటపాటల్లో మునిగితేలిన మహిళలు**

'శ్రీలక్ష్మీనీ మహిమలూ గౌరమ్మ చిత్రమై తోచునమ్మా గౌరమ్మ..బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో"..అంటూ మహిళలు ఉత్సాహంగా ఆడీపాడారు. ఆడపడుచులు అంబరాన్నంటేలా జరుపుకునే బతుకమ్మ సంబరాలు శనివారం సాయంత్రం భాగ్యనగరవ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు ఉదయమే బతుకమ్మలను రంగురంగుల పూలతో పాటు తంగేడు పూలతో అందంగా పేర్చి పూజ గదిలో పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు కాలనీల్లో, పార్కుల్లో, దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేసిన బతుకమ్మ వేడుకల వద్దకు వెళ్లి ఆడి పాడారు.తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి.

## హైటెక్స్‌లో అతిపెద్ద స్క్రీన్‌పై భారత్-పాకిస్థాన్ మ్యాచ్

### వరల్డ్ బుక్ ఆప్ రికార్డ్సులో నమోదు



**అతిపెద్ద స్క్రీన్‌వద్ద అంధ విద్యార్థులకు బ్యాట్‌లు అందజేస్తున్న నటి శ్రీయా శరణ్, ఉదిత్ దుగర్ తదితరులు**

హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త: ప్రపంచకప్ క్రికెట్‌మ్యాచ్‌లో భాగంగా భారత్ -పాకిస్థాన్ క్రికెట్‌మ్యాచ్‌ను ఫెర్నోడ్ రికార్డ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో అభిమానుల కోసం అతిపెద్ద స్క్రీన్‌లపై ప్రదర్శించారు. దీనికి ముఖ్యఅతిధిగా సినీనటి శ్రీయా శరణ్ హాజరయ్యారు. హైటెక్స్‌లోని హాల్‌నెంబర్ 2లో 64 అడుగుల వెడల్పు , 22అడుగుల ఎత్తు, మరొకటి 80అడుగుల వెడల్పు, 36అడుగుల వెడల్పు ఎత్తుల గల అతిపెద్ద స్క్రీన్‌లపై మ్యాచ్ ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. ఈస్క్రీన్‌పై మ్యాచ్ వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులను ఇది ఎంతగానో ఆకర్షించింది. ఈసందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డును నిర్వాహకులు ఉదిత్‌దుగర్‌కు శ్రియా శరణ్ అందజేశారు. అలాగే అంధక్రికెటర్లకోసం ఫెర్నాడ్ రికార్డ్ ఇండియా విరాళంగా ఐదువేళ బ్యాట్‌లు, బంతులను అందజేసింది.ఈకార్యక్రమంలో అంధక్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డి,ధీరజ్ సిక్వేరా, కె.అనిల్‌రెడ్డి, అనంత్ స్వరూప్, నవనీత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్సీక్లస్టర్ కబడ్డి టోర్నమెంట్



**కబడ్డి పోటీలను తిలకిస్తున్న డీపీఎస్ సీఓఓ యసస్వీ**

నాచారం, అక్టోబర్ 14 ప్రభాతవార్త: పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఆద్వర్యంలో సీబీఎస్సీ క్లస్టర్ 7కబడ్డి టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈవెంట్‌లో శనివారం పలువురు క్రీడాకారులు ఆసక్తీగా పాల్గొన్నారు. ఈ వేడుకలను డిపీఎస్ పల్లవి, డీపీఎస్ స్కూల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సీఓఓ మల్కా యశస్వీ మాట్లాడుతూ ఈ సీబీఎస్‌సీ క్లస్టర్ల క్రీడలు, ఆటల ద్వార పిల్లల్లో సామాజిక, నైతిక విలువలను పెంపొందించడం జరుగుతుంద న్నారు. పిల్లలను భాధ్యతా యుతమైన పౌరులుగా ఎదగ డానికి క్రీడలు ఎంతో దోహదం పడుతాయని పేర్కొ న్నారు. పిల్లలో క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి ఎంతో అవస రమన్నారు. క్రీడలు, విధ్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యా నికి ఎంతో ముఖ్యమని యశస్వీ పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ హేమ బడబూషి మాట్లాడుతూ పిల్లలో క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. క్రీడలు, విధ్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ముఖ్య మన్నారు. శారీరక విద్య, క్రీడల యొక్క ప్రాముఖ్యతను అభ్యాస ప్రక్రియలో అంర్భాగమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీను పాల్గొన్నారు.

## ప్రజలకు నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం హరిస్తుంది

### టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కొదండరాం



**ప్రొ.కొదండరామ్‌ను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు**

తార్నాక, అక్టోబర్ 14 ప్రభాతవార్త: ప్రజలకు నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం హరిస్తుందని టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కొదండరాం ఆరోపించారు. అఖిల పక్షం సడక్ బంద్ పిలుపు నిచ్చిన నేపథ్యంలో శనివారం ఒ.యూ పోలీసులు ముందస్తుగా ప్రొ.కొదండరాంను హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రొ.కొదండరాం మాట్లాడుతూ వరుసగా పరీక్షల నిర్వాహణంలో వైఫల్యం చెందుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి, కమిటీ సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బోర్డును రద్దు చేయాలని, కమిటీ సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. పరీక్షల రద్దువల్ల ఎంతో మంది నిరుద్యోగ విధ్యార్థులు నష్టపోయారని వారందరికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిజేఎస్ విద్యార్థి నేతలు సర్దార్ వినోద్ కుమార్, సిపిఐ ఎంఎల్ డెమెక్రసీ నాయకులు గోవర్ధన్, చలపతిరావు, ఆశప్ప, రవికాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఎర్రగడ్డ మాజీ కార్పొరేటర్ మహ్మద్ షరీఫ్ మృతి



యూసుఫ్‌గూడ, అక్టోబర్ 14, ప్రభాతవార్త : ఎర్రగడ్డ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ హాషీనా బేగం భర్త మహమ్మద్ షరీఫ్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నాంపల్లి కేర్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో శనివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు, భార్య ఉన్నారు. కాంగ్రెస్ పార్టఈ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించి కీలక నేతగా ఎదిగారు. దివంగత నేత పీజేఆర్‌కు నమ్మిన బంటుగా ఉండేవారు. 2002 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎర్రగడ్డ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందారు. 2016, 2021 ఎన్నికల్లో ఎర్రగడ్డ డివిజన్ మహిళా రిజర్వేషన్ కావడంతో తన భార్య మహమ్మద్ హాసీనా బేగంను కార్పొరేటర్‌గా గెలిపించుకున్నారు.ఇప్పటికీ ఎంఐఎం పార్టీలో కీలక నేతగా ఉంటూ మృతిచెందటం అందరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నేతలు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆదివారం శంకర్‌లాల్‌నగర్ స్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.



**శనివారం అంబర్‌పేట్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కుటుబ సభ్యులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

### దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు

# జ్ఞాన సరస్వతీ ఆలయం ముస్తాబు



చిక్కడపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త: శ్రీ జగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ శ్రీశృంగేరి శారదా పీఠాధీశ్వర పరమహంస పరివ్రాజ కాచార్య వర్యేత్యాది సకలబిరుదావళి విరాజమానులు అనంతశ్రీ విభూషిత భారతీతీర్థమహాస్వామి, విధుశేఖర భారతీస్వామి అనుగ్రహ ఆశీస్సులతో ముషీరాబాద్‌లోని జ్ఞానసరస్వతి దేవాయలంలో అక్టోబరు 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించబోతున్నట్లు ఆలయం సీఈవో, అడిస్ట్రేటర్, పద్మశ్రీ డాక్టర్ గౌరీశంకర్, ధర్మాధికారి కళావిఎస్. జనార్ధనమూర్తి, సీఈఓ వివరించారు. అక్టోబరు 14న ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటలవరకు మూలవిరాట్ అభిషేకం తిరిగి ఉదయం 8.30గంటల నుంచి 10 గంటల వరకు హరిద్రా దర్శనం, అమావాస్య అలంకారం ఉంటుందని వివరించారు. 15న ఉదయం బ్రాహ్మీ అలంకారం, 16న మహేశ్వరి అలంకారం, 17న కౌమారి అలంకారంమ, 18న వైష్ణవి అలంకారం, 19న ఉదయం గజలక్ష్మి, 20న మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి అలంకారం, 21న ఇంద్రాణి అలంకారం, 22న దుర్గా, 23న రాజరాజేశ్వరి, 24న కామధేనువు అలంకారాలుంటాయన్నారు. 20న అక్షరా భాస్యాలు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు, రాత్రి 8.30 గంటలకు హంసవాహన సేవ ఉంటుందని వివరించారు.

**ఆలయం చరిత్ర..** ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన మహామాన్విత క్షేత్రం తొలి నాళ్లలో సీతాలక్ష్మణ సమేత విగ్రహాలతో ఆశ్రమంగా ఉండేది. పిరాట్ల రామలక్ష్మమ్మ అదిలాబాద్ జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రమైన బాసర జ్ఞానసరస్వతి దేవాలయాన్ని దర్శించిన అనంతరం తిరిగి నగరానికి వచ్చి తర్వాత ఆమెకు స్వప్నంలో సరస్వతీదేవి సాక్షాత్కరించి ఆశ్రమంలో ప్రతిష్టింపచేయమని చేసిన ఆదేశాల మేరకు 1995లో ముషీరాబాద్‌లో అమ్మవారిని ప్రతిష్టించిన తర్వాత 2002 నుంచి శృంగేరి జగద్గురు మహా సంస్థానము వారి పాలనలోకి తీసుకోవడం జరిగింది. 2007లో గర్భాలయం ప్రాకారాలను నిర్మాణం పూర్తి స్థాయిలో సంప్రదాయబద్ధంగా ధూపధీప నైవేద్యాలతో విరాజిల్లుతోంది. అమ్మవారికి సంబంధించి అనేక నమ్మకాలు, విశ్వాసాలు నాటిన ఉంచి ప్రాచూర్యంలోకి రావడం, ప్రదానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలలోని భక్తులతో పాటు తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా బాసరకు రావడం అక్షరాభ్యాసాలు, ఉపనయనాలు, వివాహాధి శుభకార్యాలకు విశేషంగా భక్తులు రావడం జరుగుతోంది. అదే శక్తి మహిమాన్విత గల హైదరాబాద్ నగరంలో ముషీరాబాద్‌లో కొలువైన జ్ఞానసరస్వతి దేవి అమ్మవారికి దర్శించినా అవే ఫలితాలు, వారి మనోభీష్టాలు నెరవేరుతాయని ఏన్నోఏళ్ళుగా తరలివస్తున్నారు. ఆలయంలో అక్షరాభ్యాసం చేసుకున్న వారు ఉన్నత చదువులు చదివి దేశవిదేశాల్లో ఉన్నత పదవులలో ప్రస్తుతం రాణిస్తున్నారు.

**ధర్మాధికారిగా కళావిఎస్.జనార్ధనమూర్తి పర్యవేక్షణలో**

శృంగేరి పీఠాధిపతులు, మహాసన్నిధానం శ్రీ భారతీతీర్థ మహా స్వామివారు, సన్నిదానం శ్రీ విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులతో జ్ఞానసరస్వతీ ఆలయానికి ధర్మాధికారిగా త్యాగరాయ గానసభ అధ్యక్షుడు ప్రస్తుత అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తిని ఆలయ ధర్మాధికారిగా నియమించడం గొప్ప విశేషం.బాధ్యతలను చేపట్టిన ఐదు నెలల కాలంలోనే ఆలయాభివృద్ధికి, ఆలయ రూపురేఖలను మార్చివేయడంతో పాటు ప్రాంగణంలో శ్రీ భారతీతీర్థ మహాస్వామివారు, సన్నిదానం శ్రీ విధుశేఖర భారతీస్వామి చిత్రపటాలు ఏర్పాటు, కల్యాణమంటపానికి ఆధునికమైన లైటింగ్, సౌండ్‌సిస్టమ్, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించారు.

# హస్తం ఆశావహుల్లో ఆందోళన

➢ నేడు కాంగ్రెస్ తొలి జాబితా

➢ మరో మూడు రోజుల్లో మిగిలిన పేర్లు విడుదలకు ఏర్పాట్లు




హైదరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులకు టికెట్ టెన్షన్ పట్టుకుంది. గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. అభ్యర్థుల ఎంపికపై స్పీడు పెంచిన హస్తం పార్టీ.. గెలుపు గుర్రాల వేటలో పడింది. దీని కోసం ఢిల్లీ వేదికగా వడపోత ప్రారంభించింది. గెలుపు గుర్రాలను బరిలోకి దించేందుకు తీవ్ర కసరత్తు చేస్తుంది. ఇప్పటికే మూడుసార్లు సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ..అభ్యర్థుల పేర్లను కొలిక్కి తెచ్చారు. అయితే దీనికి పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ, ఏఐసీసీ ఆమోదం తర్వాత అభ్యర్థుల ప్రకటన చేయనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదలపై స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ కీలక ప్రకటన చేశారు. ఆదివారం తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. అందులో 58 మంది పేర్లతో ఫస్ట్ లిస్ట్ ఉంటుందన్నారు. మిగతా అభ్యర్థులను మరో రెండ్రోజుల్లో ఖరారు చేస్తామని పేర్కొన్నారు. దీంతో ఆదివారం జాబితా విడుదల కానుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. లిస్ట్‌లో ఎవరి పేర్లు ఉంటాయి. అధిష్టానం ఎవరికి హాండ్ ఇవ్వనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో పాతబస్తీ మినహా ఇతర సెగ్మెంట్ల నుంచి దరఖాస్తులు దండిగా వచ్చాయి. అయితే జాబితా విడుదలకు సమయం దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఒకరిద్దరు నడుమనే అంతంత మాత్రంగా పోటీ ఉండగా తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అభ్యర్థుల సంఖ్య పెరగడంతో పాటు టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఢిల్లీలో తొలి జాబితా విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.మొదటి విడత జాబితాలో ముషీరాబాద్, ఎల్‌బినగర్,ఇబ్రహీంపట్నం, నాంపల్లి,జూబ్లిహిల్స్ నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ఎల్‌బినగర్ నుంచి మధుయాస్కీ గౌడ్, ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి,నాంపల్లి నుంచి ఫిరోజ్ ఖాన్, జూబ్లీహిల్స్ నుండి అజారుద్దీన్,మల్కాజ్‌గిరి నుండి మైనంపల్లి హనుమంతరావు పేర్లు ఖరారు అవకాశాలున్నాయి. అంబర్‌పేట టికెట్ కోసం ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నూతి శ్రీకాంత్‌గౌడ్‌లు పోటీ పడుతున్నారు. ఆర్ లక్ష్మణ్‌యాదవ్‌కు మాజీ ఎంపి వి.హనుమంతరావు వంతపాడుతుండగా, నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు కొందరు సీనియర్ నాయకులు మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ఈ నియోజక వర్గాన్ని పక్కనపెట్టినట్లు సమాచారం. మహేశ్వరం టికెట్‌ను బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డికి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.లేనిపక్షంలో చల్ల నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డిలలో ఒకరికి అవకాశం ఉంది. ఉప్పల్ నుంచి పరమేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ నుంచి కొలను హనుమంతరెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, రాజేంద్రనగర్ నుంచి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కస్తూరి నరేందర్, శేరిలింగంపల్లి నుంచి జెరిపేటి జయపాల్, సత్యనారా యణ, ఎం.రఘునాథ్‌యాదవ్, మలక్‌పేట నుంచి సంగిరెడ్డి, చెకొలేకర్ శ్రీనివాస్, ఖైరతాబాద్ నుంచి రోహిణ్‌రెడ్డి, విజయారెడ్డి, సనత్‌నగర్ నుంచి మర్రి ఆధిత్యారెడ్డి, కోట నీలిమ, డాక్టర్ రవీందర్‌గౌడ్, సికింద్రాబాద్ నుండి నాగులూరి సాయిబాబా, ఆదం సంతోష్‌కుమార్, నోముల ప్రకాశ్‌గౌడ్, కూకట్‌పల్లి నుంచి గొట్టిముక్కల పద్మా రావు, సత్యం శ్రీరంగం, కంటోన్మెంట్ నుంచి సర్వే సత్యనారాయణ, పిడమర్తి రవి, జీవకన్‌లు టికెట్టు ఆశిస్తున్నవారిలో ఉన్నారు. ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలి అన్న నిర్ణయంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ ప్రాతిపదికన టికెట్లను కేటాయిస్తారన్న అంశం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది.

సర్వేల ఆధా రంగా అయితే చాలా మంది సీనియర్లకు అవకాశం దక్కకపోవచ్చు అని పార్టీ శ్రేణులు అంటున్నాయి. పైరవీల ద్వారా అయితే పలువురు సీనియర్లు, ముఖ్య మైన నాయకులకు టికెట్లు వచ్చే అవకాశం ఉంది. కానీ గెలవడం, సాధ్యం కాదు అని అంటున్నారు. మొత్తం గ్రేటర్ వ్యాప్తంగ కాంగ్రెస్ పార్టీ జాబితా కోసం ఆ పార్టీ శ్రేణులే కాకుండా ఇతర పార్టీల వారు, రాజకీయ నిపుణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాబితా విడుదలకు సమయం దగ్గర పడడంతో టికెట్ వస్తుందో రాదోననే ఆందోళన మొదలైంది. అయితే టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు ఎన్నికల సమయంలో సహకరిస్తారా? లేదా? అనే ఆందోళన సైతం నెలకొన్నది.



**ట్యాంకు బండుపైన బతుకమ్మ ఆడుతున్న మహిళలు**

# గోషామహల్ ఆశావహుల అసహనం

## నియోజకవర్గంలో అన్ని పార్టీలు అభ్యర్థుల ఆలసత్వమెందుకు?

గోషామహల్,అక్టోబర్ 14ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికలో భాగంగా గోషామహల్ నియోజకవర్గంలోని వివిధ పార్టీల నుంచి పోటి చేసే అభ్యర్థులను ప్రకటించేందుకు బిజెపి,బిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీల అధిష్టానం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆశావహులు, ఆయా పార్టీ అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్రచారం చేసుకునేందుకు దాదాపు నెలపైగా సమయం ఉన్నప్పటికి అభ్యర్థులను ప్రకటించడంలేదు. ఆటు ప్రజలకు, ఇటు ఆయా పార్టీ అభిమానులు, నాయకులకు టెన్షన్,టెన్షన్ పెడుతున్నారు. కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ అధిష్టానం వ్యూహాలు,ప్రతివ్యూహాలను రచిస్తున్నారు. ఎలాగైనా టిక్కెట్ దక్కించుకునేందుకు శత విధాల గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నంద కిషోర్‌వ్యాస్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఎం.ఆనంద్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు ప్రేమ్‌సింగ్‌రాథోడ్, ఉద్యమ నేత ఆర్వీమహేందర్‌కుమార్,మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్తలు జోరుగా ప్రయత్నాలు చేస్తు న్నా రు. సీటు ఎవరికి దక్కుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సీటు వస్తుందో,లేదో అనే భయంతో జర్వాలు వచ్చినట్లు తెలిసింది. తమ కొడుకులు, సోదరులు, మిత్రులను రంగంలోకి దింపి ఓటర్ల మనోభావాలను అడిగి తెలుసుకుంటున్నారు.

ఆశా వాహులైన అభ్యర్థులు ఆయా బస్తీలీడర్లు, ఆయాపార్టీలో ఉన్న సీనియర్ నాయకులను కలుసుకుని ప్రజల నుంచి ఏవిధమైన హామిలు, వ్యతిరేకం ఉందని తెలుసుకున్న తరువాతనే ఆయాపార్టీలకు చెందిన అభ్యర్థులను ప్రకటిస్తారని ప్రచారం జరుగుతందని,చేతిలో డబ్బులు పట్టుకుని కాళ్లకు గజ్జెలు కట్టుకుని తమ గాడ్ ఫాదర్‌ల చుట్టు తిరుగుతున్నారు.ఉత్కంఠ భరితంగా గోషామహల్ నియోజక వర్గంలో ప్రజల తలలో నాలుకగా ఉంటూ నియోజకవర్గంలోని బస్తీలలో తిరిగారు. కాని సీటు వస్తుందా,లేదా అనేభయంతో బిజెపి,బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు తామంటే తాము రంగంలో ఉంటామని చెబుతున్నారు. దీనితో ఆయా ప్రాంతాల ఆశావహులు ప్రత్యామ్నాయే మార్గాలను అన్వేషి స్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సారి జరిగే ఎన్నికల్లో పోటి చేయకుంటే జీవితంలో మరి ఎప్పుడు పోటి చేయలేమని బిఆర్ఎస్,బిజెపి,కాంగ్రెస్ నాయకులు తమ అనుచరుల వద్ద చర్చించుకుంటున్నారు.టిక్కెట్ కోసం ఏవరికివారే టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త: ఫుట్‌పాత్‌లపై అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 13 డౌన్‌టౌన్ విస్కీ బాటిల్స్, 60 ఆఫీసర్స్ చాయిస్ విస్కీ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి, ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ వివరాలు వెల్లడించారు. ఫుట్‌పాత్‌లపై అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా యని అందిన సమాచారం మేరకు దాడి చేయడం జరిగిందని, ఈ కేసులో అక్రమంగా మద్యం అమ్ముతున్న శ్రీనివాస్, భాస్కర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పొన్నాల గతే మీకు పడుతుంది

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్




మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త : నాలుగున్నర దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో పని చేసిన పొన్నాల లక్ష్మయ్యపై కాంగ్రెస్ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కండకావరం, అహంకారపూరితమైనవని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శించారు. తెలంగాణలో టికెట్లు ఇప్పిస్తామని వసూలు చేసిన సొమ్ముతో ఢిల్లీలో డబ్బు సంచులు పంపిణీ చేసి పొన్నాలకు అపాయిట్మెంట్ దొరకకుండా రేవంత్‌రెడ్డి అడ్డుపడ్డారని దానం దుయ్యబట్టారు. ఎమ్మెల్యే అవకాశం ఇవ్వకపోతే పొన్నాల సీనియార్టీని గౌరవించే ప్రయత్నాలు చేయకపోగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలపట్ల రేవంత్‌రెడ్డి వైఖరి అర్థమవుతుందని దానం విమర్శించారు. పొన్నాల లక్ష్మయ్యపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దానం నాగేందర్ ఫిల్మ్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొన్నాల చావు గురించి మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఆ భగవంతుడు జీవితకాలం జీవితాన్ని ఏమైనా రాసి పెట్టాడా అని దానం ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోని అంజన్ కుమార్ యాదవ్, హనుమంతరావు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కత్తి వెంకటస్వామి లాంటి సీనియర్ నేతలు ఆత్మ ప్రక్షాళన చేసుకోవాలని, నేడు పొన్నాలకు పట్టిన గతే రేపు మీకు పడుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల నాయకులను ఏదో ఒకరోజు పార్టీ నుంచి బయటికి పంపకముందే గౌరవప్రదంగా తప్పుకోవాలని దానం సూచించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకే పార్టీ టికెట్ నిరాకరించిన చరిత్ర కాంగ్రెస్‌దని ఎమ్మెల్యే గుర్తు చేశారు. సోనియాను సైతాన్ అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టిన వలస నాయకుడు రేవంత్‌రెడ్డే ఈరోజు వాళ్ళకు ముద్దయ్యాడని ఆరోపించారు.

## ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో మేరా మట్టి మేరా దేశ్



మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కొరదాల నరేష్

మూసాపేట, అక్టోబర్ 14, ప్రభాతవార్త : ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో స్థానిక యువకులు శనివారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొరదాల నరేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మేర మట్టి మేరా దేశ్ అనే కార్యక్రమం ఆజాద్ కి అమృత్ మహోత్స వంలో భాగంగా దేశమంతటా నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామం నుండి ప్రతి నగరం నుండి మట్టిని సేకరించి దేశమంతటా మట్టిని కలిపి ఒక స్ఫూర్తి చిహ్నాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. అమరవీరుల స్థూపం (అమృతవాటిక) నిర్మాణం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం నడుం బిగించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాజు, రఘు, కేశవరావు, అనిత, రమేష్, అమర్‌నాథ్, సంతోష్, శ్రీకాంత్, శివలింగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఆధారంగా బతుకమ్మ వేడుకలను జరుపుకోవాలి

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం



రంగధాముని చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 14, ప్రభాతవార్త : ఎన్నికల కోడ్ సందర్భంగా రాజకీయాలకి అతీతంగా బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించి శనివారం రంగధాముని చెరువు వద్ద పరిశీలన చేసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఆడపడుచులు అత్యంత వైభవంగా చేసుకునే పండుగ బతుకమ్మ అని అయితే ఎన్నికల కోడ్ కారణంగా రాజకీయాలకు అతీతంగా బతుకమ్మ పండుగ వేడుకలు జరుపాలని అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు చిరునామా అయిన బతుకమ్మపై ఎన్నికల కమీషన్ ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్ కోడ్ వలన అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆడపడుచులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా లైటింగ్, మంచినీళ్ళు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎలక్షన్ కమీషన్ వారు ఆలోచించి తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ ఏర్పాట్లు జరపాలని మాధవరం విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యేను గెలిపించుకుంటాం



ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్న ప్రజలు

జీడిమెట్ల, అక్టోబర్ 14, ప్రభాతవార్త : 125 గాజులరామారం డివిజన్ పరిధిలోని ఎచ్ఏఎల్ కాలనీ, ఏరోనాటిక్స్ రెసిడెంట్స్ అండ్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎచ్ఏఎల్ కాలనీ వెస్ట వెల్ఫేర్ అసోసియేషన్, ఎచ్ఏఎల్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌కే తమ మద్దతు అని ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని వారు ఏర్పాటు చేసిన సభలో మేళతాళాలతో శనివారం తమ కాలనీకు ఆహ్వానించి, తమ కాలనీల అభివృద్ధికి కృషి చేసినందుకు, ఎల్లవేళలా తమకు అండగా ఉండి సహాయ సహకారాలు అందించినందుకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరోనాటిక్స్ రెసిడెంట్స్ అండ్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అడ్వకేట్ కమలాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, వీరయ్య చౌదరి, వేణుగోపాల్, బాలరెడ్డి, సాంబయ్య, డాక్టర్ రాజేశ్వర్‌రావు, వెంకటప్పయ్య, మాధవరావు, అంజయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు. ఎచ్ఏఎల్ కాలనీ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి ఆంజనేయులు, అప్పలరాజు, కృష్ణరెడ్డి, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్‌చర్య, వినోద్, శ్యామ్, వెంకట్, రవికుమార్‌లు పాల్గొన్నారు. ఎచ్ఏఎల్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.వీ మూర్తి, రమేష్‌రెడ్డి, డి.సంతోష్, కె.శ్రీనివాస్‌రెడ్డి, దుర్గ ప్రసాద్, జానీబాసా, ఆర్.ఎస్.వీ శంకర్, చంద్రనాయక్, ఎం.ప్రసాద్, బైరయ్య, కె.ధనలక్ష్మి, పి.అనిత, టి.ఆరుణకుమారి పాల్గొన్నారు.

## మనిషిని మనిషిగా గుర్తించడమే బౌద్ధిజం

### సింగూరు పాండు



రైటప్: అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న సింగూరు పాండు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 14, ప్రభాతవార్త : ధమ్మదీక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని దయారుగూడలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో సింగూరు పాండు అధ్యక్షతన పంచశీలను పటించి బుద్ధవందనం చేసి ధమ్మదీక్ష దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగూరు పాండు మాట్లాడుతూ ముందుగా మనం ధన్యవాదాలు చెప్పుకోవాల్సి వస్తే అగ్రరాజ్యం అమెరికాకు చెప్పుకోవాలని, ఎందుకంటే సమానత్వాన్ని కలిగిన బౌద్ధమే అన్ని పరిష్కారాలకు మార్గం చూపిస్తుందని బాబాసాహెబ్ అన్న మాటలను తూచా తప్పకుండా పాటిస్తున్న అగ్రరాజ్యం అమెరికాలో నేడు నిలువెత్తు విగ్రహాన్ని ఈరోజు ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. అందుకు గాను ఆ దేశానికి ఆ ప్రభుత్వానికి జై భీమ్లు ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ మన దేశంలో ప్రతిరోజు ఏదో ఒక మూలన ఆయన విగ్రహాలపై దాడులు జరుగుతుంటే ప్రపంచ దేశాల్లోనేమో ఆయనకు దండలు వేసి జేజేలు కొడుతున్నారన్నారు. కానీ ఏది ఏమైనప్పటికీ చివరికి ధర్మమే గెలుస్తుందని, ధర ్మం అంటేనే బౌద్ధం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్ళందరికీ దీక్ష దివాస్ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ పార్టీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్ నిత్యమాల కార్యదర్శులు నరసింహా, మద్దెల గిరి, సంఘం సభ్యులు గునుగుంట యాదగిరి, కళ్లెం శివకుమార్, మహిళా అడ్వకేట్ సింగూరు శిల్ప తదితరులు పాల్గొని అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.



బంజారాహిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## అమావాస్య పూజల్లో పాల్గొన్న జంపనప్రతాప్, సుస్మిత



బోయిన్‌పల్లిలో కట్ట మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్, బిజెపి నాయకురాలు సుస్మిత, జోగిని శ్యామల

కంటోన్మెంట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త: అమావాస్యను పురస్కరించుకొని శనివారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయం, చిన తోకట్ట, కట్ట మైసమ్మ దేవాలయాలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బిజెపి నాయకురాలు డాక్టర్ సుస్మితా శంకర్ రావ్, జోగిని శ్యామలలు పాల్గొని పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ ముదిరాజ్, దుర్గయ్య, రామారావ్, అజిత్, అరుణ్ యాదవ్, జాజుల సాయి,క్రాంతి, టీ.ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



వివిధ అలంకారాలలో విద్యార్థినులు

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 14, ప్రభాతవార్త : సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థలు కొంపల్లి, సుచిత్రలో శనివారం ఘనంగా ఉత్సవాలు జరుపుకోవడం జరిగింది. బతుకమ్మ పండుగ విశిష్ఠను విద్యార్థులు నృత్య రూపం ద్వారా నవరాత్రులు, 9 రకాల బతుకమ్మ గురించి, దసరా పండుగ విశిష్టత గురించి తెలియజేశారు. తర్వాత విద్యార్థులు పూలతో చేసిన బతుకమ్మలతో నృత్యం చేసి బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తర్వాత పాఠశాల డైరెక్టర్ నరిశెట్టి సుందరరాజు మాట్లాడుతూ మన పండుగలు ప్రకృతిలో భాగంగా ఉంటూ మన దేశ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, మత విశ్వాసాలతో కూడుకున్నవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమీ డైరెక్టర్ సరిత నరిశెట్టి, ప్రిన్సిపాల్ క్రిస్టీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ నియోజకవర్గం ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

చిక్కడపల్లి అక్టోబరు 14 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని నియోజకవర్గం బిజెపి సీనియర్ నేత డిఎస్.రెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడమే కారణమని శనివారం గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాల బిఆర్ఎస్ పార్టీ పాలనలో అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందని, నేటికి కూడా డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ అధ్వాన్నంగా మారిందని, ఇప్పటికీ దాదాపు అన్ని డివిజన్‌లలో కాలనీలు, బస్తీలలో రోడ్లు సరిగాలేవని, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తాను కేటాయించిన నిధులతోనే అభివృద్ధి జరుగుతుందే తప్ప మరే నిధులతో మాత్రం జరగడం లేదని అన్నారు.

## ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబరు14 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్ గుప్త అన్నారు. శనివారం చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో అన్నదాతలు ప్రొద్దుటూరి నరసింహారావు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగారపు రమేశ్, చేపూరి లక్ష్మణ్, ఏ.బాలకుమార్, శంకరయ్య, లక్ష్మినారాయణ, ప్రాజెక్టు చైర్మన్ టి.రవీందర్‌గుప్త, పల్లెర్ల రమేశ్, సింగారపు శంకర్, శంకరయ్య, బాపు, బాలచందర్, సురేందర్‌గుప్త, న్యాయవాది వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అన్ని దానాలలోకంటే అన్నదానం గొప్పదని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు చురుగ్గా పాల్గొనాలన్నారు.

## అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో టీ హోప్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టి హోప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి మహిళలతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంట్లో ఘనంగా జరుపుకోవాలని, నవరాత్రులు భక్తి శ్రద్ధలతో పూజలు చేయాలని, ఆ అమ్మవారి ఆశీర్వాదాలు అందరిపై ఉండాలన్నారు. టీ హోప్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆరు డివిజన్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు భారీగా పాల్గని బతుకమ్మ ఆటలు ఆడి, పాడారు.



నగరంలో జరిగిన విండో ఎంటర్‌టైన్‌మెంట్స్ వారు నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా 2023 కార్యక్రమంలో పాల్గొన్న సినినటి కవిత,వ్యవస్థాపకులు ఎండి.గోపినాథ్ ,రవి,ఇతర మోడల్స్ పాల్గొన్న చిత్రం

## 15నుంచి సీతారాంబాగ్ రామమందిరంలో ప్రారంభం కానున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞం

### ఏకదాటిగా 45 రోజుల పాటు మహా యజ్ఞం

గోషామహల్, అక్టోబర్ 14ప్రభాతవార్త:భారత దేశ సర్వతో ముఖాభివృద్ధికై, భారతీయుల శ్రేయసస్సు కాంకిస్తూ ప్రపంచ శాంతి,సామరస్యాన్ని కాపాడడానికి, భాగ్యనగర పురోభివృద్ధిని కోరుకుంటూ సనాతన ధర్మ సంప్రదాయాలకు అనుగుణగా 45 రోజులపాటు మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని లతామా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవిలత తెలిపారు.ఈమేరకు శనివారం సీతారాంబాగ్ శ్రీరామ దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతినిధులు ఆర్.ఎల్.ఎన్‌రావు,యమన్‌సింగ్‌లతో కలిసి ఆమె మాట్లాడుతూ ఈనెల 15వ తేదిన ఆశ్వయుజ శుద్ధ నుండి ప్రారంభమై నవంబర్ 27వ తేదిన కార్తీక పౌర్ణమి వరకు మహా యజ్ఞం కొనసాగుతుందన్నారు. సహస్ర చండీ సహిత మహా రుద్ర కామేశ్వర,కామేశ్వరి యాగం జరుగుతుందన్నారు. 36రకాల వైధిక విదుల,12 రకములైన కళ్యాణాలతో పాటు పలు విధములైన హోమాలు కూడా జరుగుతాయన్నారు.భారత భాగ్య సమృద్ధి అన్ని పేరు యజ్ఞానికి పెట్టడానికి గల కారణాలు వివరిస్తూ దేశమంటే మట్టికాదోయ్,మనుష్యులని మహాకవి అన్నట్లు భారతీయులందరు సమృద్ధి సాధిస్తే తప్ప దేశ సమృద్ధి సాధించలేమని అంటూ ఈ యజ్ఞం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.సమృద్ధితోపాటు దేశ పౌరులం దరికి, ప్రజల హిత కొరుతూ ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు ఈ యజ్ఞస్థలంలో నిర్వహించబడుతాయని తద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఈ యజ్ఞంలో ప్రజలందరు అధిక సంఖ్యలో పాల్గొన్న వల్సిందిగా కోరారు.

## కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి అధ్యక్షులుగా నాతి మురళి కృష్ణ గౌడ్

మెహిదీపట్నం, అక్టోబర్ 14, ప్రభాతవార్త : కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి నూతన అధ్యక్షునిగా నాతి మురళి కృష్ణ గౌడ్ నియమితులైనారు. ఉపాధ్యక్షులుగా కె. సంజయ్ సింగ్, ఠాకూర్ శైలేందర్ సింగ్, ఎ.మహేష్ కుమార్, అంతారం రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎ.గోవర్ధన్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.కృష్ణ, రాచకొండ శ్రీకాంత్ సాగర్, ఎన్.రమేష్, కార్యదర్శులుగా పడాల అనంత్ కృష్ణ, ఎం.శంకర్, కె. జవహార్, పంబి వేణు, ఎ.సాయినాథ్, ఆర్.రక్షిత్, కోశాధికారిగా కె.ఈశ్వర్, మండప ఇన్‌చార్జిగా ఎస్.దీపక్ రాజ్, కార్యవర్గ సభ్యులుగా కె.బాబు, జి.హరినాథ్, సి.అమిత్ కుమార్, నితేష్, ఆర్.పనవ్ కుమార్, ఎస్.శ్యామ్‌లింగం, మనోహర్, సలహాదారులుగా మదన్ జాదవ్, ప్రేమ్ కుమార్, ఎస్.జ్ఞానేశ్వర్, పంబి శ్రీనివాస్, కె.జైహింద్, జి.కృష్ణ, ఎన్.గోవింద్, ఎం.నరేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాతి మురళి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ..కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దర్బార్ మైసమ్మ దేవాలయం వద్ద ప్రతి సంవత్సరం మాదిరిగానే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తుల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మాతా వైష్ణవి దేవి విశాల జాగరణ, అన్నదానం, దుర్గాష్టమిని పురస్కరించుకొని శాంతి యజ్ఞము కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఎప్పుడూ ఆదరణ

### జూబ్లీహిల్స్ మాజీ శాసనసభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి



వెంగళ్‌రావు నగర్‌లో పార్కులో వాకర్స్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్న మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 14, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఎప్పుడూ ఆధరణ ఉంటుందని జూబ్లీహిల్స్ మాజీ శాసనసభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం జూబ్లీన్లహిల్స్ నియోజకవర్గం పరిధిలోని వెంగళ్‌రావునగర్ డివిజన్ సిద్ధార్థ్‌నగర్, మధురానగర్ పార్కులలో వాకర్స్‌తో కలిసి పాదయత్రలో పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో తమకు మద్దతు ఇవ్వాలని వాకర్స్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బిట్ల శుశీల్‌కుమార్, ఎర్రకృష్ణకుమార్, దూడల రవీగౌడ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కావాలనే తప్పుడు ఆరోపణలు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 14, ప్రభాతవార్త : బోరబండ బీఆర్ఎస్ కార్పొరేటర్ పీఏ ఇంట్లో డ్రగ్స్, నార్కోటిక్ అధికారులు దాడులు చేశారని మహమ్మద్ ఇస్మాయిల్ (అబ్బు), ఇంట్లో 6 గ్రాముల కొకైన్ స్వాధీనం కేసు నమోదు చేసిన నార్కోటిక్స్, ఎక్సైజ్ అధికారులు అంటూ వాట్సాప్, సామాజి మాధ్యమాలలో చెక్కర్లు కొడుతుండటంతో ఎక్కడా కూడా పోలీసులు దాడులు చేసినట్లుగాని కేసు నమోదైనట్లుగాని లేకపోవటంతో దీనికి సంబంధించి మహమ్మద్ ఇస్మాయిల్ అలియాస్ అబ్బు తనపై వచ్చిన ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. కావాలనే కొందరు శనివారం ఉదయం నుంచే సోషల్ మీడియాలో తప్పుడుగా వైరల్ చేస్తున్నారని వారంతా కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారేనని తానుకూడా టీఆర్ఎస్వీ నాయకుడినని తనపై కుట్రలు చేస్తున్నారి ఇందులో ఎలాంటి నిజాలులేవని అన్నారు. తాను కార్పొరేటర్ పీఏ అని ప్రచారం చేస్తున్నారని మాదగ్గర డ్రగ్స్ దొరికాయని వైరల్ చేస్తున్నారని ఇప్పటి వరకు తనపై ఎలాంటి కేసులు ఏమీ లేవని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన తాను మాత్రం బాబా ఫసియుద్దీన్ వెంట ఉంటాని ఉద్యమం సమయం అప్పుడుకూడా తాను బాబా ఫసియుద్దీన్‌తోనే ఉన్నాని ఇప్పుడు కూడా ఆయనను నమ్ముకునే ఉన్నాని ఎంతో మంది మధ్యలో వచ్చిపోయారని ఈ సమస్యను హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ప్రజాశాంతి పార్టీ పోటీ



ఓ.యూలో మాట్లాడుతున్న కె.ఏ పాల్

తార్నాక, అక్టోబర్ 14 ప్రభాతవార్త: తాను సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఏ పాల్ పేర్కొన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యకు నిరసనగా డా.కె.ఏ పాల్ ఓ.యూకు వచ్చి ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట కాలినడకన నడిచి మాట్లాడుతూ నిరుద్యోగంతో మృతి చెందిన ప్రవళిక మరణం అందరిని కలచివేసిందని ఇలాంటి ఘటనలు తిరిగి ఎవరు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేసి తమ అందరిమీద భారం మోపుతుందన్నారు.తనను గెలిపిస్తే అప్పులన్నింటిని తీర్చి, విధ్యా, ఉద్యోగం, వైద్యం ఉచితంగా ఇస్తానని హామినిచారు. అక్కడ ఏ.పీ, ఇక్కడ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అందరు అభివృద్ధి చెందుతారని అనుకొని ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించానని చెప్పారు. అక్కడ కేసీఆర్ ఆద్వర్యంలో నేడు అప్పుల తెలంగాణ అయ్యిందన్నారు. ధరణి పోర్టల్ ద్వార ఎంతో అవినీతి జరిగిందన్నారు. నేడు కేంద్ర, రాష్ట్రాల్లో ప్రజా సేవచేసే నాయకులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

## సుందరయ్య పార్కులో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

చిక్కడపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త: బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో శనివారం బతుకమ్మ సంబురాలు అంబరన్ని అంటాయి. నారాయణగూడలోని జాహ్నవి విద్యాసంస్థలు, ఆర్క్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. విద్యాసంస్థల అధినేత ఏ.పరమేశ్వర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్‌చైర్మన్ ఏ.లక్ష్మి, ప్రిన్సిపల్స్ భావన, సరిత, రాజేశ్వరి, సరిత, ఉదయ్, శిల్ప, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు. విద్యార్థినులు పెద్దసంఖ్యలో చేరుకుని బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

## ఖర్గేను కలిసిన గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు



ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేను కలిసిన గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సి.కె.మూర్తి

బేగంబజార్, అక్టోబర్ 14ప్రభాతవార్త: ఢీల్లిలో ఎఐసిసి అధ్యక్షులు,పార్లమెంట్ సభ్యులు ఖర్గేను గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సి.కె.మూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. నవంబర్ 30వ తేదిన తెలంగాణ రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వాలని కోరుతూ ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేను కలిసి విన్నవించినట్లు గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సి.కె.మూర్తి తెలిపారు.

## బీఆర్ఎస్ నుండి బీజెపిలోకి చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, అక్టోబర్ 14, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్‌నగర్ డివిజన్ పరిధి, సాయిబాబా నగర్‌కు చెందిన బిఆర్ఎస్ నాయకులు, యువకులు శనివారం మాజీ ఎమ్మెల్యే, బీజెపి రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ బీజెపి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కుత్బుల్లాపూర్ అభివృద్ధి కూన శ్రీశైలం గౌడ్‌తోనే సాధ్యమని భావించి బీజెపిలో చేరుతున్నట్లు తెలిపారు. బీజెపిలో చేరిన వారిలో సాయిబాబా నగర్‌కు చెందిన రాజు, బుల్లెట్ సాయి, లక్ష్మణ్, లోకేష్, రామ్, అరవింద్ తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్‌లో మహిళల చేరిక



అల్వాల్, అక్టోబరు 14 ప్రభాతవార్త: మహిళా మండలికి చెందిన సభ్యులు శనివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఓల్డ్‌అల్వాల్‌లో ఉద్యమకారిణి మాధవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పనితీరుకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు మహిళలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వారికి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అనిత, విజేత, రోజ్, కళ్యాణి, మంజు, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త : వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతుంది. బిజెపి నుండీ ఇటీవల పెద్ద సంఖ్యలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాగా శనివారం కూడా అమీర్‌పేట డివిజన్‌కు చెందిన పలువరు అమీర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నుండి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అమీర్‌పేట డివిజన్ బిజెపి మాజీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రాజ్ పురోహిత్ నాయకత్వంలో సుమారు 20మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాన రాష్ట్రం ఏర్పడిన తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. 60 సంవత్సరాలలో జరగని అభివృద్ధి కేవలం ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో తొమ్మిదిన్నర సంవత్సరాలలో చేసి చూపించారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత ్వంలో అన్ని వార్గల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వివిధ భాషలు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని కూడా తమ బిడ్డల్లాగానే కళ్ళల్లో పెట్టుకొని చూసుకుంటున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మాయమాటలతో చుట్టపు చూపుగా వచ్చే పార్టీల నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలేదని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి కోసం పని చేస్తున్న బిఆర్ఎస్ పార్టీపై ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందన్నారు. వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరుతుండటమే అందుకు నిదర్శనమని అన్నారు. పార్టీలో చేరిన చైన్‌సింగ్, దేవేందర్‌సింగ్, సర్దార్‌బేగ్‌సింగ్, సామిక్‌పాల్, అశోక్ మంచాల, అశ్విన్‌రాజ్ పురోహిత్, దర్శన్‌రాజ్ పురోహిత్, భానుశ్రీకాంత్, అశోక్‌రాజ్ పురోహిత్, విజయ్ సింగ్ రాజ్ పురోహిత్, శంకర్ లాల్‌కచ్వా, శ్రవణ్ రాజ్‌పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే విజయం ఖాయం



లంగర్‌హౌస్ డివిజన్‌లో పాల్గొన్న మిత్ర కృష్ణ

మెహిదీపట్నం, అక్టోబర్ 14, ప్రభాతవార్త : సమన్వయంతో పనిచేస్తే కార్వాన్ సెగ్మెంట్‌లో విజయం ఖాయమని బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షులు చంద్రకాంత్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మిత్ర కృష్ణ పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో అన్ని వర్గాల ప్రజల మద్దతు బిఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి సంక్షేమ పథకం ప్రతి కుటుంబానికి అందాయని తెలిపారు. సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు మరల అమలు కావాలంటే రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పక్షపార్టీలకు చెందిన నాయకులు మాయమాటలు చెబుతూ అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వారి మాటలు ప్రజలు నమ్మరన్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేయక నేడు ఎన్నికలు రాగానే గ్యారంటీల పేరుతో ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటన్నారు. ప్రతి పక్ష పార్టీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి తెలంగాణలో లేదన్నారు. సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూముకుంట అరుణ్‌కుమార్ నాయకులు క్రిష్ణదాస్, వినోద్, క్రిష్ణయాదవ్, కార్తీక్, పల్లవి, విజయలక్ష్మి, స్వరూప కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజల సహకారంతో శేరిలింగంపల్లిలో విజయం తథ్యం

**ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ**




సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గాంధీ

కూకట్‌పల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త : తాను చేసిన అభివృద్ధితోపాటు ప్రజల సహకారంతో శేరిలింగంపల్లిలో మళ్ళీ విజయం తథ్యమని ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి శాసనసభ్యులు ప్రభుత్వవిప్ గాంధీకి మద్దతుగా కార్పోరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి పార్ట్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసి సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసం వద్ద సమావేశం నిర్వహించగా డివిజన్ పరిధిలోని నాయకులు, కార్యర్తలు, మహిళలు పెద్ద ఎత్తున మద్దతు తెలియజేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ తాను చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని, వారి సహకారంతో మళ్ళీ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావు, కూకట్‌పల్లి డివిజన్ పార్ట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి గాయత్రి మహాక్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

శామీర్‌పేట, అక్టోబరు 14, ప్రభాతవార్త : తూంకుంటలోని గాయత్రి మహాక్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలో ఉన్న శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఎస్‌విఎల్ఎన్.మూర్తి తెలిపారు. ఈ నెల 15నుంచి 24వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. రోజు వారీగ వివిధ రూపాల్లో నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని మూర్తి కోరారు. 15న ఆదివారం బాలత్రిపుర సుందరిదేవిగ, 16న కంచి కామాక్షిదేవిగా, 17న మధురమీనాక్షిదేవిగ, 18న వనదుర్గదేవిగా, 19న మహాలక్ష్మిదేవిగ, 20న సరస్వతిదేవిగ, 21న అన్నపూర్ణదేవిగ, 22న కనకదుర్గదేవిగ, 23న రాజరాజేశ్వరిదేవిగ, 24న మంగళవారం చివరి రోజున నిజరూపంలో భక్తులకు దర్శనం ఇస్తారని ఆయన తెలిపారు.



1వ వార్డు పెద్ద తోకట్ట ముత్యాలమ్మ దేవాలయం వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న బిఆర్ఎస్ నేత ముప్పిడి మధుకర్ తదితరులు

## సహకార సొసైటీల అభివృద్ధికి సర్కార్ చేయూత

**దూదిమెట్ల బాలరాజు యాదవ్**

మెహిదీపట్నం, అక్టోబర్ 14, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని బలహీన వర్గాలకు చెందిన సహకార సంఘాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు ఆ సంఘాలలోని సభ్యులను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర గొర్రు, మేకల వృత్తిదారుల సహకార సంఘం సమాఖ్య చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో కల్లుగీత కార్మికుల సమాఖ్య చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల వృత్తిదారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ..గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలోని వెనుకబడిన తరగతుల వృత్తిదారుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు జరుపుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. వెనుకబడిన తరగతులకు చెందినట్లు చెప్పుకుంటున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ వెనుకబడిన తరగతుల ప్రజల సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదన్నారు. కులవృత్తులలో ఆధునిక టెక్నాలజీ పేరిట విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి గ్రామీణ ప్రాంతాలలోని కుల వృత్తులకు ఆదరణ లేకుండా చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ రాష్ట్రంలోని కులవృత్తులను పునరుద్దరించడానికి వేలాది కోట్ల నిధులను కెటాయించి ఖర్చు చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాల హయాంలో తెలంంగాణ ప్రాంతంలోని కులవృత్తులు మసకబారాయన్నారు.

## నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాము: మంత్రి తలసాని

సికింద్రాబాద్, అక్టోబర్ 14 ప్రభాతవార్త: యాభై సంవత్సరాలలో కాని అభివృద్ధి పనులను సనత్‌నగర్ నియోజకవర్గంలో జరిపించామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రారంభించిన పనులు త్వరతలోనే పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించామన్నారు. అత్భుతమైన రోడ్ కనెక్టివిటీ, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాలు కల్పించామన్నారు. ఫ్లైఓవర్, అండర్ పాస్‌లు నిర్మించామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గంలో ఉన్న దేవాలయాలు, మసీదులు, హిందు, ముస్లిం, క్రైస్తవుల స్మశానాలు అత్భుతంగా తయారు చేశామన్నారు. జరిపిన అభివృద్ధిని ప్రజలు గుర్తించారని, వారి ఆశీస్సులు తనకు మెండుగా ఉన్నాయన్నారు. దశాబ్దాల కాలంగా ఎలాంటి కనీస అవసరాలు తీర్చలేని పాలకుల వల్ల విసిగి పోయిన ప్రజలు తెలంగాణ ప్రభుత్వానికి నీరాజనాలు అర్పిస్తున్నారన్నారు.

**బీసీలపై అగ్రకుల అహంకారం చూపిస్తే సహించేది లేదు: మంత్రి తలసాని**

బీసీల పట్ల అగ్రకుల దురంహాకారం చూపిస్తే సహించేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. విలేకరుల సమావేశంలో మంత్రి తలసాని రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన పొన్నాల లక్ష్మయ్యకు, కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఇవ్వచ్చు, ఇవ్వకపోవచ్చు అది పార్టీకి సంబందించిన విషయమని, రాజీనామా చేస్తే పొన్నాల లక్ష్మయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. బీసీ నాయకుడే కాకుండా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిని పట్టుకొని నోటికొచ్చినట్లు మాట్లాడడం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. బీసీలపై అగ్రకుల అహంకారం చూపిస్తే సహించేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా హెచ్చరించారు.

**అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజయం సాధించడం అభినందనీయం**

కంటోన్మెంట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త: 3వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కంటోన్మెంట్ రసూల్‌పురాకు చెందిన సాయికుమార్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో కరాటే విజేత సాయికుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని పెంచుతున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.

## ప్రవల్లిక కుటుంబానికి న్యాయం చేయాలి

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



ధర్నాచౌక్, అక్టోబర్ 14, ప్రభాతవార్త: అశోక్‌నగర్‌లోని హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడి, మృతి చెందిన ప్రవల్లిక కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి న్యాయం చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయి బాబా డిమాండన చేశారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆత్మహత్యలు పెరిగిపోయి, ఆత్మహత్యల తెలంగాణగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు రాకపోవటం వల్లనే యువత వత్తిడికి గురయి మానసిక స్థైర్యాన్ని కోల్పోతున్నందు వల్లనే ఏ సమస్య వచ్చినా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. టీఎస్‌పిఎస్‌సి నిర్లక్ష్యం వల్లనే పోటీ పరీక్షలు రద్దు అవుతున్నాయని, దీనిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా వారినే నూతన కార్యవర్గ కమిటీని నియమించకుండా పాత వారినే కొనసాగించటం ఎందుకని ప్రశ్నించారు. సంవత్సరాలు తరబడి ఫీజులు కట్టి కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువతలో ఇంకెంత మంది ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వంలో చెలనం వస్తుందని మండిపడ్డారు. ఆత్మహత్యలపై కేంద్రంకూడా జోక్యం చేసుకుని, విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయండి

**ఎంబిసి చైర్మన్ నందికంటి శ్రీధర్**



సమావేశంలో నందికంటి శ్రీధర్

అల్వాల్, అక్టోబరు 14 ప్రభాతవార్త: పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయడం ద్వారా ఎన్నికలో సునాయసంగా విజయం సాధించగలుగుతామని ఎంబిసి చైర్మన్ నందికంటి శ్రీధర్ తెలిపారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మాజీ కోఆప్షన్ సభ్యురాలు జ్యోతి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సూర్యనగర్‌లో జరిగింది. ఇటీవలి రాజకీయ పరిణామాలు నేపథ్యంలో నేతలు,కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని నందికంటి తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని పేర్కొన్నారు. సీఎం కెసిఆర్ పనితీరు, సంక్షేమ పథకాలు పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు గొట్టిముక్కల శ్రీనివాస్ గౌడ్, డోలి రమేష్, సిఎల్ యాదగిరి, శ్రీధర్ గౌడ్, బస్వరాజు, ఢిల్లీ పరమేష్, పవన్, తిరుపతి, క్రిష్ణవేణి, సరిత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : సిఐ విజయేందర్ రెడ్డి




5వ వార్డు వాసవి సేవా సమితి అన్నదాన వేడుకల్లో పాల్గొన్న జింఖానా సిఐ విజయేందర్ రెడ్డి, సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డు వాసవి కాలనీలో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి కార్ఖాన ఇన్‌స్పెక్టర్ విజయేందర్ రెడ్డి, ఎస్ఐ నరేశ్‌లు పూజలు జరిపి పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్‌గుప్త, వాసవి సేవా సమితి ప్రతినిధులు డి.కె.శ్రీనివాస్, మనిగండ్ల శ్రీనివాస్, గంప సాయి, రాంబాబు పాల్గొన్నారు.

**21నుంచి 23వరకు ఎగ్జిబిషన్**

హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త: ఈనెల 21,22,23 తేదీల్లో మాదాపూర్ హైటెక్‌సిటిలోని నోవాటెల్‌హోటల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు శనివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ కథానాయికలు శ్రీలేఖ, ఐశ్వర్య, సుప్రియలతోపాటు పలువురు మోడల్స్ పాల్గొని సందడి చేశారు. అనంతరం ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా తమ చీరకట్టుతో ర్యాంప్‌పై నడిచి ఆకట్టుకున్నారు. మూడురోజులపాటు జరిగే ఈఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా పేరొందిన దాదాపు 360మందికిపైగా డిజైనర్లు తమ ఉత్పత్తులను నగరవాసులకు పరిచయం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా తన మద్దతు

**టి హోప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కె.ఉపేందర్ రెడ్డి**



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని ఎంపిక చేసినా తన మద్దతు ఉంటుందని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టి హోప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కె.ఉపేందర్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో గెలిచిన చరిత్ర ఉందని ఆయన గుర్తు చేశారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, టిపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉపాధ్యక్షుడు, ప్రముఖ క్రికెటర్ అజారుద్దీన్ సమక్షంలో కె.ఉపేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విధితమే. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్లలో టీ హోప్ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయాల వద్ద శనివారం సద్దుల బతుకమ్మ వేడుకలను స్థానిక మహిళలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలంటే మహిళలే ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు.

## రాష్ట్రంలో వైద్యవిద్యకు అత్యంత ప్రాధాన్యం

**ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి**



ఉబ్జేకిస్థాన్ ప్రతినిధులను సన్మానిస్తున్న వేణుగోపాలచారి

హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం వైద్యవిద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఈమేరకు సోమాజిగూడలో ఉబ్జేకిస్తాన్‌లోని తాష్కెంట్ మెడికల్ అకాడమీ (టిఎంఏ), నగరంలోని నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ల ఆధ్వర్యంలో ఉబ్జేకిస్థాన్‌కు బయలుదేరిన 250మంది వైద్య విద్యార్థులకు మెడ్ వోయేజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఐపాడ్‌లు, వైద్యవిద్యపాఠ్యపుస్తకాలు, ఉచితంగా ఉబ్జేకిస్థాన్‌కు విమాన టికెట్లు అందించారు. ఈసందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ విద్యార్థులు విదేశాల్లో చదువుకుని మాతృదేశానికివచ్చి సేవలందించాలని సూచించారు. నియో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ దివ్యరాజ్ రెడ్డి మాట్లాడుతూ ఉబ్జేకిస్థాన్ ఆరోగ్యమంత్రి శాఖ భారత ప్రతినిధిగా నియామకం పొందిన తర్వాత ఉబ్జేకిస్థాన్ యూనివర్సిటీలు తమ అధికారిక ప్రతినిధి కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ఒప్పించినందుకు గర్వపడుతున్నాన్నారు. వైద్య విద్యార్థులందరూ నేషనల్ మెడకల్ కమిషన్ పెట్టిన నిభందనలకు కట్టుబడి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఆర్టిఐ కమిషనర్ విజయ్‌బాబు, ప్రముఖ పల్మనాలజిస్ట్ డా.విశ్వేశ్వరన్, ఉబ్జేకిస్థాన్ రాయబార కార్యాలయ ప్రతినిధి మొహ్మద్, టిఎంఏ డా.శుక్రత్, నియోరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవల్లిక మృతి బాధాకరం : ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త : అశోక్‌నగర్‌లోని బృందావన్ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటున్న ప్రవల్లిక మృతి బాధాకరమని, కుటుంబ సభ్యులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రవల్లిక మృతితో తల్లిదండ్రుల బాధ ఎవరూ తీర్చలేనిదని, కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని దానం వెల్లడించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలోని కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని, ప్రవల్లిక కుటుంబాన్ని కూడా తప్పకుండా ఆదుకుంటారని దానం తెలిపారు. ట్విట్టర్‌లో వచ్చే సందేశాలకు స్పందించి ఆదుకునే మంత్రి కెటిఆర్ కూడా ప్రవల్లిక విషయంలో తప్పకుండా స్పందిస్తారని దానం అన్నారు. మానసిక వేదనతో ఆమె ఈ లోకాన్ని విడిచి వెళ్ళినట్లుగా అర్థమవుతుందని ఎవరూ ఇలాంటి పనులకు పాల్పడి కుటుంబాన్ని మానసిక వేదనకు గురి చేయవద్దని దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. ప్రవల్లిక మృతిపై కాంగ్రెస్, బిజెపిలు రాజకీయాలు చేయటం మానేసి, ఆ కుటుంబాన్ని ఆదుకునే దిశగా ఆలోచించాలని దానం నాగేందర్ సూచించారు.

## ఎంబిసి చైర్మన్ పదవి సంచార జాతులకే ఇవ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్, నాగరాజు తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 14,ప్రభాతవార్త: సంచారల జాతుల అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఎంబిసి కార్పొరేషన్‌కు ఎంబిసిజాబితాలో ఉన్న కులాలకు చెందిన వ్యక్తినే నియమించాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒంటెద్దు నరేందర్, నాగరాజులు మాట్లాడారు. సంచార జాతుల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ను మొదటిసారిగా ఇతర సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తికి ఇస్తే తాము పట్టించుకోలేదని అన్నారు. రెండోవిడత కూడా ఇదే వ్యవహారాన్ని కొనసాగించడం ఏంటని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి మూడువేలకోట్లు కేటాయించినా ఖర్చు చేసింది మాత్రం 7నుంచి 10కోట్లేనన్నారు. రాష్ట్ర జనాభా 10శాతం జనాభా కలిగిన సంచార జాతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికలల్లో ఎంబిసి సంక్షేమం పట్ల చిత్తశుద్దితో పనిచేస్తామని హామీ ఇచ్చిన వారికే తామంతా మద్దతు తెలుపుతామని పేర్కొన్నారు.

## భారత్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం

ఘట్‌కేసర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, అనురాగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు భారత్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు. ఈమేరకు భారత్ వరల్డ్ రికార్డ్ అడ్జడికేటర్ డాక్టర్ దేవేందర్ బండారి చేతుల మీదుగా ఆయన ధృవపత్రాన్ని అందుకున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు నివారించడంలో భాగంగా అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా అనురాగ్ యూనివర్సిటీ మనోజాగృతి ఆధ్వర్యంలో భారత్ వరల్డ్ రికార్డ్ ఒక చరిత్ర సృష్టించింది. ఈకార్యక్రమంలో రెండు గంటలపాటు మానసిక ఆరోగ్యంపై గ్రూపు డిమాండ్ స్టేషన్ సెషన్ 100 మంది సైకాలజిస్టులు, కౌన్సిలర్స్ ఒక సింగిల్ వెన్యూలో నిర్వహించారు. ఈసమాజాన్ని ఉన్నతమైన సమాజంగా ఉల్లాసంగా ఉన్నటువంటి మానసిక ఆరోగ్య కోసం నిర్మించే ప్రయత్నంలో భాగంగా ఈరికార్డ్‌ను అందించారు. రికార్డ్‌లో పాల్గొన్న సైకాలజిస్టులు కౌన్సిలర్లు స్టూడెంట్స్, మెంటార్స్ అందరికీ కూడా మహిపలి శ్రీనివాస్‌రావు ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైన శ్రీసంగమేశ్వర వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయం

నాంపల్లి, అక్టోబరు 14 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయం 15-10-2023 ఆదివారం నుండి 23-10-2023 సోమవారం వరకు శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలకు ఆధ్యాత్మికత ఉట్టిపడుతూ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అంగరంగ వైభవంగా జరిగే నవరాత్రుల్లో ప్రతీరోజు ఉదయం 5గంటలకు అమ్మవారి అభిషేకం; 9గంటలకు అమ్మవారి అలంకార దర్శనం; 10నుండి 12గంటల వరకు అమ్మవారి హవనము, లఘు పూర్ణాహుతి, మహానివేదన, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు; రాత్రి 6.30గంటల నుండి శ్రీ లలితా సహస్రనామార్చన, నివేదన, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాదాల వితరణ తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించబడతా యని తెలిపారు. అమ్మవారి దివ్యాలంకారాల పూజాకార్యక్రమాలతోపాటు 15 ఆదివారం ఉదయం 5గంటలకు శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, అంకురారోహణము, మృత్సంగ్రహణం, దీక్షాస్వీకారము, కలశస్థాపన, అభిషేకము, 9గంటలకు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారము; 16 సోమవారం శ్రీ గాయత్రీదేవి అలంకారము; 17 మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారము; 18 బుధవారం శ్రీ వైష్ణోదేవి అలంకారము; 19 గురువారం శ్రీ లలితాదేవి అలంకారము; 20 శుక్రవారం శ్రీ సరస్వతీదేవి అలంకారము; 21 శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారము, ఉదయం 9గంటలకు లక్షపుష్పార్చన, మధ్యాహ్నం 12.30గంటల నుండి అన్నదానము; 22 ఆదివారం శ్రీ దుర్గాదేవి అలంకారము, ఉదయం 9గంటలకు చండీహోమము; 23 సోమవారం శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారము, 9.30గంటలకు మహాపూర్ణాహుతి, సాయంత్రం 5.30 గంటలకు శమీపూజ, కలశ ఉద్వాసన తదితర పూజ్యాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వేదపండితులు, అర్చలచే నయనానందకరంగా జరుపబడ తాయని, అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాకార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ, కార్యనిర్వహణాధికారి కోరారు.

## లాస్య విజయానికి ప్రతి ఒక్కరు పాటుపడాలి : మంత్రి తలసాని




కంటోన్మెంట్ బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, విపక్షాలను ప్రజలు ఎవరు నమ్మడం లేదని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం కార్ఖానలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన బిఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. తండ్రిని కోల్పోయిన లాస్యను గెలిపించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. వ్యక్తిగత విబేదాలు, గ్రూప్ రాజకీయాలు పక్కనపెట్టి లాస్య విజయానికి అందరు కృషి చేయాలన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న లాగే లాస్యను కూడా కంటోన్మెంట్ ప్రజలు సంపూర్ణ మద్ధతు పలుకుతున్నారన్నారు. కంటోన్మెంట్‌లో ప్రతినోటా బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య గురించే చర్చ జరుగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు లాస్య గెలుపుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్, లోకనాథం, పి.శ్యామ్,భాగ్యశ్రీ, అనిత ప్రభాకర్, బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ హరిక, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, డైరెక్టర్లు బి.నారాయణ, దేవులపల్లి శ్రీను, భాస్కర్ ముదిరాజ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహా ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు పెద్దాల నర్సింహా, సదానంద్ గౌడ్, పనస సంతోష్, తేజ్‌పాల్, వినోద్, కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంగిలిపూల బతుకమ్మతో సంబరాలు ప్రారంభం

ఘట్‌కేసర్, అక్టోబర్ 14, ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. బతుకమ్మ వేడుకల్లో భాగంగా మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో గత రెండు, మూడు రోజులుగా మహిళలు వివిధ రకాల పూవులను సేకరించిన మహిళలు బతుకమ్మలను తయారు చేశారు. తీరొక్క రంగుల పూలతో బతుకమ్మను పేర్చి పసుపు, కుంకుమతో గౌరమ్మను చేసి భక్తి, శ్రద్దలతో పూజ చేసి వేడుకలను ప్రారంభించారు. ఆడపడచులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను ఒక చోట చేర్చి చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, చౌదరిగూడ, వెంకటాద్రిటౌన్‌షిప్, కార్తికేయనగర్, వైష్ణవినగర్, స్వర్ణగిరికాలనీ, వెంకటసాయినగర్, మక్తా, సాదత్‌అలీగూడ, ఎదులాబాద్, వెంకటాపూర్, మర్రిపల్లిగూడ, ఘణాపూర్, లింగాపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్, సర్పంచులు బైరు రమాదేవి, నిరుడి గీత, చిలుగూరి మంగమ్మ, కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, కొమ్మిడి అనురాధ, సల్లూరి నాగజ్యోతి, చిల్కూరి హేమలత, బర్ల శశికళ, వసంత పాల్గొన్నారు.

FUNERAL



Sri Laxmikanth Shinde
ACP (Retd.)
DOB : 14-05-1953 | DOD : 13-10-2023
Funeral Ceremony Today 15-10-2023 at 8 am from Residence, Beside CC Shroff Hospital, Kachiguda to Puranapul Shamshan Ghat (at 9 am)
In Grief : SHINDE FAMILY
M : 90000 81982

**PUBLIC NOTICE**

This is to bring to the notice of General Public that my client M/s Spectrum Property Management and consultancy services Rep. by its Partner – Mr. Saurabh Gupta S/o. Mr. Madan mohan, aged about 42 Years, Occ: Business, R/o. 40, Bloomfield Ecstasy, Tellapur, Ramachandrapuram Mandal, HYD, Telangana – 502032 has lost AGREEMENT OF SALE cum GPA vide Doct No. 11650/2019 dated 29-06-2019 in respect of 901, Block B, Asian suncity, Kothaguda Village, Serilingampally Mandal, R R District registered with Sub – Registrar during transit between Khajaguda to Bowenpally on **18-08-2023** when my client went to get Xerox copy of the said document. Further the General public is hereby informed that any person or persons have found the said document are requested to hand over the same at the address mentioned below or to my client Spectrum Property Management and consultancy services Rep. by its Partner – Mr. Saurabh Gupta 9000518800.

**B. SHASHI KANTH**
Advocate
Flat no. 308,3 rd floor,
My home Lakshmi nivas,
Ameerpet, HYD – 500016
**9642612345**

**IN THE COURT OF THE XXVII ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT: AT SECUNDERABAD**
**I.A. No.902 of 2022**
**In**
**O.S. No. 116 of 2017**

Between:
**U.L.N. Murthy and another** ...Petitioners/Plaintiffs
And
**Smt. M. Satyavathi and others** ...Respondents/Defendants

To,
**1. Smt. M. Satyavathi,** W/o Late M.V.B.R.K. Mohan, Aged 51 years, Occ: Lecturer, R/o Flat No.208, 2nd Floor, Pearl Apartments, Shyamlal Buildings, Begumpet, Secunderabad.
**2. U. Ravi Shanker,** S/o U. Rammohan Rao, Aged 43 years, Occ: Service, R/o Flat No.208, 2nd Floor, Pearl Apartments, Shyamlal Buildings, Begumpet, Secunderabad.
Please take notice that the above IA is filed by the Plaintiff for divide Schedule Property as per the preliminary decree passed by this Hon'ble Court. The same is posted for your appearance on **31.10.2023 at 10.30** am in the above designated Court either in person(s) or through an Advocate, failing which the matter will be heard and decided in your absence.

(By Order of the Hon'ble Court)
**M/s. R. SUBRAMANIAN & ASSOCIATES**
**Smt B. VIJAYA LAKSHMI**
**Advocates**
# 1, Ramnagar, Picket, Secunderabad-3,
Mobile No: 9440668965/9248008695

# లెట్స్ మెట్రో ఫర్ సిబిఎన్ కార్యక్రమం చేపట్టిన ఐటీ ఉద్యోగులు

## ఎల్‌బినగర్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన, ఉద్రిక్తత



చంద్రబాబుకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ఐటీ ఉద్యోగులు

**మన్సూరాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** నగరంలో ఐటీ ఉద్యోగులు శనివారం మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు మద్దతుగా చేపట్టిన లెట్స్ మెట్రో ఫర్ సిబిఎన్ కార్యక్రమం మియాపూర్ టూ ఎల్‌బినగర్ కార్యక్రమం చేపట్టారు. కాగా ఉదయం నుండి నిరసనకారులను వివిధ మెట్రో స్టేషన్లలో అడ్డుకోగా చివరకు ఎల్‌బినగర్ మెట్రోస్టేషన్‌వరకు వందలాది మంది చేరుకుని చంద్రబాబునాయుడుకు మద్దతుగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఐతే ఎల్‌బినగర్ వరకు చేరుకున్న తర్వాత తిరిగి తాము మెట్రోలో వెళ్తామని చెప్పగా ఎల్‌బినగర్ పోలీసులు అడ్డుకుని వారిని స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో ఉద్యోగులు, చంద్రబాబు మద్దతుదారులు ఆందోళన చేపట్టి ఎల్‌బినగర్ మెట్రో స్టేషన్ వద్ద నినాదాలు చేయగా పోలీసులు వారిని బలవంతంగా వ్యాన్‌లో తరలించే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో ఉద్యోగులకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట నెలకొని కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎల్‌బినగర్ మెట్రో స్టేషన్‌కి భారీగా చేరుకున్న ఉద్యోగులు ఎల్‌బినగర్ నుండి దిల్‌సుఖ్‌నగర్ వైపు ర్యాలీ నిర్వహించి జగన్ ప్రభుత్వంపై మండిపడుతూ చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. మధ్యలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్దకు రాగానే అక్కడ గుంటూర్ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి చేరుకుని చంద్రబాబు మద్దతుదారులతో కలిసి ర్యాలీ నిర్వహించే ప్రయత్నం చేశారు. దీంతో ఎల్‌బినగర్ ఏసిపి జానకిరెడ్డి జోక్యం చేసుకుని ఎలాంటి ర్యాలీలకు అనుమతులు లేవని వెంటనే వెళ్ళిపోవాలని సూచించిన వినకుండా ఉద్యోగులు ర్యాలీ నిర్వహించే ప్రయత్నం చేయగా ఏసిపికి, వారికి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఐటి ఉద్యోగులను అదుపులోకి తీసుకోవడంతో పాటు ఎమ్మెల్యే శ్రీదేవిని సైతం పోలీసువ్యాన్‌లో ఎల్‌బినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ఆందోళనలతో ఎల్‌బినగర్ మెట్రోను బంద్ చేశారు. దీంతో మెట్రో ప్రయాణీకులు అవస్థలు పడాల్సి వచ్చింది. అయితే శనివారం చేపట్టిన ఐటీ ఉద్యోగుల తోపాటు వారి పిల్లలు, పెద్దలు పెద్దఎత్తున ఎల్‌బినగర్‌లో ఆందోళన చేపట్టడంతో కొంతసేపు తీవ్ర గందరగోళ పరిస్థితులు తలెత్తాయి.

# కాలభైరవ ఆలయంలో బిఎల్ఆర్ పూజలు


కాల భైరవ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని స్వయంభు కాల భైరవఆలయంలో పెత్తర అమావాస్య సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన పూజ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల బైరవ ఆలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఆలయాభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు కమ్మ లక్ష్మణ్, శామీర్‌పేట వినోద్‌రెడ్డి, బొమ్మల సుధాకర్,రాకేష్‌రెడ్డి, పుట్లూరి ఉపేందర్, బొట్టు వెంకట్, సంతోష్, రమాకాంత్‌రెడ్డి, బాషపల్లి నిరంజన్ చారి, మంద శేఖర్, చంద్రారెడ్డి, బిఆర్‌ఎస్ నేతలు పోగుల దయాకర్‌రెడ్డి, అరటికాయల భాస్కర్, మేకల మధుసూధన్‌రెడ్డి, పిల్లి నాగరాజు, వి.సంతోష్‌రెడ్డి, గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌బినగర్‌లో 5.66లక్షల మంది ఓటర్లు

## గతంలో కంటే లక్షన్నర మంది పెరిగిన ఓటర్లు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం సుమారు లక్షన్నరకు పైగా ఓటర్లు పెరిగారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికలలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో 4,01,137మంది ఓటర్లు ఉన్నారు. అయితే గత 5 సంవత్సరాల లోపు 5,67,185 లక్షలమంది ఓటర్ల నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. అక్టోబర్ నాటికి సుమారు 1,55,000 మంది ఓటర్లు పెరిగినట్లు అధికారులు తెలిపారు. అయితే ఈనెల 30వ తేదీ వరకు మరింత మంది ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. శాసనసభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే వరకు ఓటర్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఫెడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్వేత బెత్తం దినోత్సవం వేడుకలు : గంగారాం

**మలక్‌పేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్వేత బెత్తం దినోత్సవం వేడుకలను నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ మద్దెల గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషనం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధులకు శ్వేత బెత్తంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతన్నాయని వివరించారు. శ్వేత బెత్తం దినోత్సవ నడకపేరుతో కార్యక్రమాలు నిర్వహించడంవల్ల అంధత్వంపై అంధుల అవసరాలు, ఆచరణలపై చైతన్యం తీసుకురావడానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ కమిషనర్ శైలజ తదితరులు హాజరవుతారని తెలిపారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ


బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ఐడియల్ కళాశాల విద్యార్థులు

**మలక్‌పేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఐడియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ బి.మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో విచ్చేసి వివిధరకాల పూలతో బతుకమ్మలను సందరంగా అలంకరించి ఆట, పాటలతో నృత్యాలు చేస్తే బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థులకు పండుగల విశిష్టత, వాటి ప్రాముఖ్యత గురించి తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు భాగ్యలక్ష్మి, సుమితారెడ్డి, రావణ్, పద్మజ, వైస్ ప్రిన్సిపల్ శ్రీరాంకుమార్,లెక్చరర్స్ డాక్టర్ గాయత్రి, సుచిత, జాహ్నవి, అన్నపూర్ణ, ఎల్లప్ప, మంజువాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మరో సారి అవకాశమిస్తే మరింత బాధ్యతతో పని చేస్తా : సబితాఇంద్రారెడ్డి


సబితారెడ్డికి మద్దతు తీర్మాణాలను అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘాలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** తనపై విశ్వాసంతో మద్దతు ఇచ్చి గెలిపిస్తే గతంలో కంటే ఎక్కువ బాధ్యతతో పని చేస్తానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం అసెంబ్లీనియోజకవర్గ బిఆర్‌ఎస్ అభ్యర్థి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి కాలనీ సంక్షేమ సంఘాలను కోరారు. జిల్లెలగూడ ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌హాల్‌లో బిఆర్‌ఎస్‌ఆధ్వర్యంలో మీర్‌పేట్‌కార్పొరేషన్ కాలనీల సంక్షేమ సంఘాల కార్యవర్గాలతో జరిగిన ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడుతూ తనపై కాలనీవాసులు చూపుతున్న ఆదరణ, అభిమానాలను కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు కూడా అండగా ఉండి ఆశీర్వదిస్తే ప్రజల సంక్షేమానికి, ప్రాంతాల అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.
**సబితారెడ్డికి మద్దతుగా కాలనీ సంఘాల తీర్మాణాలు...** సబితా ఇంద్రారెడ్డికి మద్దతు ప్రకటించిన కార్పొరేషన్‌లోని 51 కాలనీ సంక్షేమ సంఘాలు తీర్మాణాలకు సంబంధించిన కాపీలను అందజేశారు. సమావేశానికి హాజరైన సంఘాల కార్యవర్గాలు సబితారెడ్డి మద్దతూ ఏకగ్రీవ తీర్మాణాలు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, సీనియర్ నాయకురాలు సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేటర్లు, నాయకులు, అనుబంధ విభాగాల వారు, కాలనీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మైనంపల్లి

**మల్కాజిగిరి, అక్టోబరు 14 ప్రభాతవార్త:** మల్కాజిగిరి అల్వాల్‌కు చెందిన చికెన్ సెంటర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి సుమారు 500 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి ఆదేశాలమేరకు కార్పొరేటర్ ఎలక్షన్స్ లో అభ్యర్థికి సపోర్ట్ చేసి భారీ మెజారిటీతో గెలిపించామని, ఇప్పుడు మైనంపల్లికి మా మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చికెన్ సెంటర్ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉండి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజేష్, అజయ్‌గౌడ్, నాగేష్, గోపాల్, యాదవరెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రలవి గార్డెన్స్‌లో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

**వనస్థలిపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం 5గంటలకు చింతలకుంట ప్రల్లవి గార్డెన్స్ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో జరగనుంది. వర్తమాన రాజకీయాల్లో బ్రాహ్మణుల పాత్రపై ఈ సమ్మేళనంలో రాష్ట్ర నాయకులు, ప్రభుత్వ సలహాదారులు, బ్రాహ్మణ, మహిళా సంఘాల నాయకులు పాల్గొని చర్చలు జరుపుతారని తెలిపారు. బ్రాహ్మణ యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమ్మేళన చీఫ్ కన్వీనర్లు తులసి శ్రీనివాస్, ఎస్‌టి.చారి పేర్కొన్నారు. ఈ నెల 29న స్థానిక బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వివాహ పరిచయ వేదిక దరఖాస్తులు ఈ సమ్మేళనంలో లభ్యమవుతాయన్నారు. అనంతరం భోజన ఏర్పాట్లు చేసినట్లు సమ్మేళన నిర్వాహక కన్వీనర్ పోగుల రాంబాబు తెలియచేశారు.

# కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సభకు మహిళలు తరలిరావాలి : అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన సోమవారం సాయంత్రం బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సభకు మహిళలు పెద్దసంఖ్యలో తరలి రావాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపిఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ పిలుపునిచ్చారు. బిజెపి సభను పురస్కరించుకొని శనివారం ఆయన కార్పొరేషన్‌లోని సప్తగిరి కాలనీవాసులతో పాటు పలువురు మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా సభ జరుగుతుందనీ ఈ మేరకు సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, నడికుడ యాదగిరి, తర్రె మల్లేష్ యాదవ్, చిత్రం శ్రీనివాస్, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, యెల్చల భాస్కర్‌రెడ్డి, నివేదితలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి : జి.ఆర్.కిరణ్


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జిఆర్ కిరణ్

**సరూర్‌నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యతనివ్వాలని టిఎస్ ఆర్టీసి సీనియర్ డివిజనల్ మేనేజర్, ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు జిఆర్ కిరణ్ పిలుపునిచ్చారు. నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో సిబిఎస్ఇ క్లస్టర్ 7 వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఈ నెల 16వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ టోర్నమెంట్‌ను ఆయన ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి గ్రూపు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ మల్కా కొమురయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐఐసిఎం లైజన్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె.వెంకట్‌రెడ్డి, చైర్మన్ కొమురయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి తురాగ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలయ తరలింపు యత్నాన్ని విరమించుకోవాలి

**హయత్‌నగర్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీపరిధి లక్ష్మారెడ్డిపాలెంలోని అభయాంజనేయస్వామి, జమ్మి హనుమాన్ ఆలయాలను యధావిధిగా అక్కడే ఉంచాలని ఆలయ రక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఆలయం వద్ద సమావేశమైన భక్తులు ఈమేరకు తీర్మాణం చేశారు. ఆలయం వెనుక ప్రహారీని తొలగించడంపై నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ తరలింపు యత్నాన్ని మానుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని కోరారు.

# బియన్‌రెడ్డినగర్ నుండి బిఆర్‌ఎస్‌లోకి చేరికలు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇతర నాయకులు తదితరులు

**వనస్థలిపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్ నియోజకవర్గంలో గత 5 సంవత్సరాలుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ గ్రామం నుండి నీళ్ల రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అధ్యక్షతన శనివారం 50 మంది యువకులు బిఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీకి భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్‌ఎస్ మాజీ అధ్యక్షులు గడ్డం మల్లేష్‌గౌడ్, పార్టీలో చేరిన వారిలో సుధాకర్‌యాదవ్, అశోక్‌నాయుడు, రాజు, సునీల్, రాఘవేందర్‌రావు, జగన్, హరిబాబు తదితరులు ఉన్నారు.

# నేటి నుంచి కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

**సైదాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసశర్మలు తెలిపారు.. దేవాలయ ప్రాంగణంలోని శ్రీ దుర్గామాత ఆలయాన్ని, శ్రీ సరస్వతి దేవి అలయాలను ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా 15వ తేది ఆదివారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంలో, 16వ తేది సోమవారం శ్రీ గాయత్రిదేవి అలంకారంలో, 17వ తేది మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో, 18వ తేది బుధవారం శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో, 19వ తేది గురువారం శ్రీ లలితా దేవి అలంకారంలో, 20వ తేది శుక్రవారం శ్రీ సరస్వతి దేవి అలంకారంలో, 21వ తేది శనివారం శ్రీ గౌరిదేవి అలంకారంలో, 22వ తేది ఆదివారం శ్రీ దుర్గాదేవి అలంకారంలో, 23వ తేది సోమవారం శ్రీ రాజ రాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం 7.30కు చండీహోమం, 22వ తేది ఆదివారం సద్దుల బతుకమ్మ, 23వ తేదీ సోమవారం విజయదశమిని నిర్వహించనున్నారు. 20వ తేది శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం ఉంటుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని చైర్మన్ రఘుమారెడ్డి, ఈవో శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు కోరారు.

# ఉత్సవాలకు కట్ట మైసమ్మ ఆలయం ముస్తాబు


రామంతాపూర్‌లో కొలువుదీరిన శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారు దృశ్యం

**రామంతాపూర్, అక్టోబరు 14 ప్రభాత వార్త :** రామంతాపూర్ శ్రీ కట్ట మైసమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తామైంది. ఆలయంలో ఈనెల 15 నుంచి 23 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి అధ్యక్షుడు బండారు వెంకట్రావ్ తెలిపారు. ప్రతి రోజు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరణ చేస్తామని తెలిపారు. ఈనెల 15న శ్రీ కట్టమైసమ్మ దేవిగా అలంకారం, 16న శ్రీ బాలత్రిపుర సుందరీదేవిగా, 17న శ్రీ కామధేనువుదేవిగా, 18న శ్రీ మహాలక్ష్మిదేవిగా, 19న శ్రీ లలితా త్రిపురా సుందరీదేవిగా, 20న శ్రీ సరస్వతిదేవిగా, 21 శ్రీ అన్నపూర్ణదేవిగా, 22న శ్రీ దుర్గాదేవిగా, ఈనెల 23న శ్రీ మహిషాసురమర్ధిని దేవిగా, అదే రోజు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అలంకణ ఉంటుందని తెలిపారు. అనంతరం శమీ పూజ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హజరుకావాలని సూచించారు.

# టీఎస్‌పీఎస్‌సీని రద్ధు చేయాలంటూ హయత్‌నగర్‌లో వామపక్షాల సడక్ బంద్

## నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైన భోర్డుచైర్మన్, సభ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్


హయత్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

**హయత్‌నగర్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** విద్యార్థులు, నిరుద్యోగులు, యువకుల ఆత్మహత్యలకు కారణమైన టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, బోర్డుసభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సభ్యులను తొలగించి బోర్డును పునరుద్ధరించాలని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు, ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై సడక్‌బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారని... నోటిఫికేషన్లు లేక, పోటీ పరీక్షల వాయిదాతో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిరుద్యోగ భృతికింద 3 లక్షల రూపాయలు ఇవ్వాలని, టీఎస్‌పీఎస్‌పీ బోర్డు నిర్లక్ష్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లిక కుటుంబానికి 50 లక్షల రూపాయల పరిహారం అందించి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బోర్డును పూర్తిగా రద్ధు చేసి అర్హులైన సభ్యులతో పునరుద్ధరించి వెంటనే ఆయా పరీక్షలను నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జనసమితి పల్లె వినయ్‌కుమార్, నాయకులు ముత్యాల యాదిరెడ్డి, సామిడి శేఖర్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్, వేణుగోపాల్, నర్సింహ పాల్గొన్నారు.

# రామంతాపూర్ పెద్ద చెరువు అక్రమణలపై జిహెచ్‌ఎంసి అధికారులు ఉక్కుపాదం

**ఉప్పల్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** రామంతాపూర్ పెద్ద చెరువు అక్రమణలపై హైకోర్టు ఆదేశాల మేరకు జిహెచ్‌ఎంసి అధికారులు అన్ని రకాల అనుమతులు నిలిపివేశారు. ఈనెల 12న హైకోర్టులో పెద్ద చెరువుపై విచారణ జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై ఇప్పటికే కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండడంతో గ్రేటర్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్‌శాఖ పెద్దచెరువు పరిధిలోని అన్ని ఇళ్లు, అపార్ట్‌మెంట్లు బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయని హైకోర్టుకు తెలిపింది. దీంతో సాయిచిత్రనగర్ రోడ్డు నెం.1 నుంచి7, రవీంద్రనగర్ స్వాతి టిఫిన్ నుంచి స్వాతి రెసిడెన్సీ వరకు, లక్ష్మినగర్ కాలనీ, మహేశ్వరినగర్ కొంత భాగం, సర్వేనెం.42,43,44 పార్ట్ 63 నుంచి 66, 30 సర్వే నెంబర్‌లలో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ గుర్తించి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆదేశాలు జారీ చేశారు. అన్ని సర్వే నెంబర్‌లను కలుపుతూ ఆరు వారాలల్లోగా ఫెన్సింగ్ వేయాలని జిహెచ్‌ఎంసిని ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు దీనిపై తగు చర్యలకు ఉపక్రమించారు. కాగా గతంలో తమకు అనుమతులు ఇచ్చి తమ స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చడంపై పలువురు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈనెల 15వ తేదిన ఉదయం 9 గంటలకు పార్కులో సమావేశమై తమ కార్యచరణ రూపొందిస్తామని పలువురు కాలనీ నేతలు పేర్కొన్నారు.

# మినీ శిల్పారామంలో బతుకమ్మ ఉత్సవాలు


మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్పో, బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం డా.బిందు మాధవి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భజమానస, గోఆలయణ్పాల,రేమ్,రేమ్ తనన, జతిస్వరం, చక్కని తల్లికి, గరుడ గమన, భోశంభో నమశ్శివాయ, అష్టలక్ష్మి, దేవదేవం తదితరఅంశాలను కళాకారులు కీర్తన, భవ్య, లక్ష్మిప్రసన్న, సూచిక, తరుణ్, జాహ్నా తదితరులు ప్రదర్శించారు. నేటినుంచి శిల్పారామంలో బతుకమ్మ సంబరాలు చేస్తున్నామని, ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చని తెలిపారు.

# శరన్నవ రాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ జయదుర్గాదేవి దేవాలయం


శ్రీ జయదుర్గాదేవి అమ్మవారు

**సైదాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** సైదాబాద్ జీవనజ్యోతి సంఘం వద్ద ఉన్న శ్రీ జయదుర్గాదేవి అమ్మవారి ఆలయం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. 15వ తేది ఆదివారం అమ మ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారం, సోమవారం గాయిత్రీ దేవి అలంకారం, మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం, బుధవారం మహలక్ష్మీదేవి, గురువారం శ్రీ మహా చండీదేవి, శుక్రవారం సరస్వతిదేవి, శనివారం శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి, ఆదివారం శ్రీ దుర్గాదేవి, సోమవారం శ్రీ మహిషాసుర మర్ధినిదేవి, శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఉదయం విశేషాభిషేకములు, మూల మంత్రాలతో హోమం, అష్టోత్తర కుంకుమార్చన. 22వ తేది ఉదయం చండీ హోమం, ప్రతి రోజు సాయంత్రం అన్నదానం నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ కొరుడు భూమేశ్వర్ తెలిపారు.

# దుర్గానగర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు

చంపాపేటడివిజన్ దుర్గానగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కాలనీఅధ్యక్షుడు కుదుముల యాదగిరిరెడ్డి, ప్రధానకార్యదర్శి వంగ జగన్నాథ్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు బి.వెంకటేష్‌లు తెలిపారు. 22వ తేది ఆదివారం సద్దుల బతుకమ్మ అనంతరం అమ్మవారికి అలంకరించిన వస్త్రాలు, కలశం వేలం ఉం టుందని, 23వ తేది సాయంత్రం జమ్మి పూజ అనంతరం రావణదహనం, 24వతేది ఉదయం అమ్మవారి ఊరేగింపు అనంతరం నిమజ్జనం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు : ఉమారెడ్డి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ చైర్మన్ ఉమారెడ్డి తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త :** మలక్‌పేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీనుండి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లూరి ఉమారెడ్డి, ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి జైమార్కండేయరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి భక్తులకు అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీనుండి విజయదశమి వరకు అభిషేకాలు, కుంకుమార్చన, బతుకమ్మ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, చెగిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణ, పూజారులు సురేష్‌శర్మ, త్రయంబకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు


బిఆర్‌ఎస్ కండువా కప్పుతున్నఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 14 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గోల్కొండ బాలరాజు, మహ్మద్ జహంగీర్‌లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో మరోసారి బిఆర్‌ఎస్ ప్రభంజనం సృష్టించి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, చెలమల యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఐటి విద్యార్థుల బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినిలు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** అందమైన రంగురంగుల పూలతో విద్యార్థినిలు బతుకమ్మవేడుకలను జరుపుకున్నారు. అమావాస్య రోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీలోని ఎల్‌ఐటి పారా మెడికల్ కళాశాల ఆవరణలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎండి.మౌలానా, కరస్పాండెంట్ ఎండి.జహంగీర్‌పాషా, ప్రిన్సిపాల్ జి.రాఘవేంద్ర, అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, సిహెచ్.మాధురి, విశ్వనాథ్, బి.అనితరెడ్డి, శ్వేతారెడ్డి, కొర్ర రాజు విద్యార్థులు పాల్గొన్నారు.